

# సూర్యదేవర రామ్ మోహన రావు

Author Of Highest Number Of Novels In Telugu



# హోమం

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి

మీ అభిమాన రచయిత

**The Number One Best Selling Author**


# సూర్యదేవర రామ్మోహనరావు


94వ నవల

# హోమం


మధుప్రియ పబ్లికేషన్స్

మాచవరం • విజయవాడ - 520 004

# HOMAM

(Serialised in 'Swathi' Weekly)

By

**SURYADEVARA RAM MOHANA RAO**

Sri Venkata Anantha Sai Nilayam

Flat No.63, Road No.71

Navanirman Colony, Jubilee Hills

Hyderabad - 500 096

E-mail : suryadevaranovelist@gmail.com

www.suryadevararammohanrao.com

www.suryadevaranovelist.com.

Published by :

**MADHU PRIYA PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 0866 - 2431969

First Edition : **2013**

Price :

**Rs. 140-00**

Cover Design :

DURGA RAO

Printers :

AKSHARAM OFFSET PRINTERS

Vijayawada - 2

# హోమం

భూమి తనలో తాను తిరుగుతూ- అనంతకాలాన్ని పుట్టిస్తుంది. సూర్యుణ్ణి చుట్టేస్తూ సంవత్సరానికి ఋతువుల్ని కల్పిస్తోంది.

సూర్యుడు తూర్పునే ఉదయిస్తాడు. పడమర అస్తమించాలి గాని ఉదయించ కూడదు. అది సృష్టి విరుద్ధం. ఈ భూమి, ఆకాశం, అనంత నక్షత్రాలు ఇదంతా ప్రకృతి, ప్రకృతి నుంచి సృష్టి జరుగుతోంది.

ఆ సృష్టి వెనుక ఒక శక్తి ఉంది. ఆ శక్తే భగవంతుడు. ఈ సృష్టికి నియమాలున్నాయి. నియమ ఉల్లంఘన జరగదు. జరిగితే... అదే విలయం... అదే ప్రళయం...

చెట్టుకు ఆకు పుడుతుంది. పండుటాకు రాలిపోతుంది. పువ్వు కాయవుతుంది. కాయ పండై రాలుతుంది. ఏ విత్తుకు ఆ మొక్కే మొలుస్తుంది. వేరే మొక్క మొలవదు. పక్షులు ఆకాశంలో ఎగరాలి. జంతువులు నేలమీదే తిరగాలి. జలచరాలు నీటిలో బతకాలి. ఇవన్నీ ప్రకృతి నియమాలే.

పుట్టుక, ఎదుగుదల, యవ్వనం, పిల్లల్ని కనటం, వృద్ధాప్యంలో మరణించటం ఇదంతా సృష్టిధర్మం. ఈ ధర్మానికి విరుద్ధంగా ఏం జరిగినా అదో గొప్ప వింతే. ప్రస్తుతం శాస్త్రవేత్తలు ప్రకృతికి విరుద్ధంగా అనేక వింతల్ని సృష్టిస్తున్నారు. జన్యు నిర్మాణాన్ని తెలుసుకుని కొత్త మొక్కల్ని, కొత్త జంతువుల్ని ఉద్భవింపజేస్తున్నారు.

సంకరజాతి మొక్కలు, మేలురకం పాడి పశువులు... క్లోనింగ్‌తో జిరాక్స్ కాపీల్లా ఒకే పోలిక గల జంతువుల్ని పుట్టిస్తున్నారు. మానవ క్లోనింగ్‌కు ప్రభుత్వాలు అనుమతి నిరాకరిస్తున్నందుకు సంతోషించాలి. లేకపోతే ఒకే పోలికతో అనేకమంది పుట్టుకొచ్చి ఎవరెవరో తెలీని అయోమయంలో పడిపోయే ప్రమాదం వచ్చిపడేది.

ఒక వస్తువు తయారవ్వాలంటే దానికి సంబంధించిన కార్ఖానా ఎక్కడో ఉండి వుండాలి... అక్కడ ఎందరో పని చేస్తుండాలి. భూమ్మీదకు జీవి ఎలా వస్తోంది?

జీవాత్మల్ని తయారుచేసే కార్ఖానా ఎక్కడుంది?

ఆ కార్ఖానా యజమాని ఎవరు? అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఎవరు? మనకు తెలీనిది ఎక్కడో ఏదో జరుగుతోంది.... ఏమిటది? అనే ప్రశ్న పుట్టి కోట్ల సంవత్సరాలు గతించినా ఇప్పటికీ ఏమిటో తెలీని అయోమయంలోనే వున్నాడు మనిషి.... అది తెలీకూడదు. తెలిస్తే సృష్టి రహస్యం గుట్టు విడిపోతుంది.

*　*　*　*　*

"ఎవరు నాయనా నువ్వు?"

"తెలీదు స్వామీ!"

"ఎక్కడి నుంచి వచ్చితివి?"

"తెలీదు."

"ఎచటకు పయనం?"

"నాకు ముందుకు పోవాలని లేదు స్వామీ. వచ్చిన దారినే వెనక్కి పోవాలనుకుంటున్నాను."

"వెర్రివాడా! ముందుకే గానీ వెనక్కి పోలేవు నాయనా... సృష్టికి ఎదురీదలేవు. నిన్ను నువ్వు తెలుసుకో."

"అర్థంగావటం లేదు స్వామీ. భూమ్మీద పడగానే ఎక్కడికొచ్చానో తెలీక

కేర్‌మని ఏడ్చాను. చనుబాలు ఇచ్చి అక్కున చేర్చుకుని ఓదార్చింది అమ్మ.

ఊహ తెలిశాక అడిగాను... అమ్మా! నేను ఎక్కడి నుంచి వచ్చానే అని... నేనెక్కడి నుంచి వచ్చానో నాకే తెలీదురా తండ్రీ! నీకెలా చెప్పను అంది."

జడలు కట్టిన జుట్టు విదిలించి చిన్నగా నిట్టూర్చాడా త్రిశూలపాణి. "ఎక్కడి నుంచి వచ్చావో ఎక్కడికి పోతున్నావో తెలీని ఓ పాంథుడా! కనీసం నీకేం కావాలో అదన్నా తెలుసా?" అనడిగాడు.

"తెలుసు స్వామీ! బాల్యం, కౌమారం, యవ్వనం, వృద్ధాప్యం. అన్వేషణలోనే మొదటి మూడూ గడిచిపోయి ఇప్పుడు వృద్ధాప్యానికి చేరువయ్యాను. త్వరలోనే పండుటాకునై రాలిపోతాను.

అలా జరగటానికి వీల్లేదు. నాకు జీవితం కావాలి. కోల్పోయిన నా యవ్వనం తిరిగి నాకు కావాలి స్వామీ."

త్రిశూలపాణి పకపకా నవ్వాడు.

"అన్నమాట... వదిలిన బాణం... ఖర్చుపెట్టిన ధనం... కాలిబూడిదైన కట్టె... గతంలోకెళ్లిన ఋతువు... కరిగిపోయిన కాలం... తరిగిపోయిన యవ్వనం... తిరిగొస్తాయా?" అన్నాడు కళ్ళుమూసుకొని యోగముద్రలోకి వెళ్తూ...

మనం చూసే ప్రపంచం ఒకటి. మనం చూడలేని ప్రపంచం ఇంకొకటి. అక్కడి నుంచి ఇక్కడికొస్తున్నాం.

వచ్చినపని కాగానే తిరిగి అక్కడికే వెళ్ళిపోతున్నాం. మన ముందు తరాలవారి రక్తమాంసాలు, ఎముకలతో తయారైన ఈ మట్టి, ఈ నేల, ఈ దేశం, ఈ గాలి ఇవన్నీ మనకు పరమ పవిత్రమైనవే! ఇవి గతానికి ప్రత్యక్ష సాక్ష్యాలు.

పుట్టిన గడ్డకు నమస్కరిస్తున్నామంటే మన ముందు తరాలవారి ఆశీస్సులు తీసుకుంటున్నామని అర్థం.

ఆదిమానవుడి కాలం నుంచీ...

మనిషిలో ఎన్నో ప్రశ్నలు, కొన్ని ప్రశ్నలకే సమాధానాలు లభించాయి. ఎక్కడి నుంచి వస్తున్నాం. ఎక్కడికి వెళ్ళిపోతున్నాం అనే ఒకే ఒక్క ప్రశ్న మాత్రం అలాగే ఉండిపోయింది.

ఈ ప్రశ్నకు సమాధానం మతం ఒకటి చెబుతుంది.

హేతువాదులు ఇంకోటి చెబుతారు. సైన్సు మరొకటి చెప్తుంది. పొంతన ఉండదు. నమ్మకం మతం గాబట్టి ఎవరు ఏది నమ్మితే అదే సమాధానమైంది.

ఏదో ఒక లక్ష్యం, ఒక కారణం, ఒక ఫలితాన్ని ఆశించకుండా మనం ఏపనీ చేయం. సృష్టి, స్థితి, లయ– ఇవి భగవంతుడి సంకల్పమైతే మరి సృష్టించటం ఎందుకు, నాశనం చేయటం ఎందుకు? తిరిగి పుట్టించటం ఎందుకు? ఒకసారి కాదు, వందలసార్లు కాదు... వేలసార్లు పుట్టిస్తూనే వున్నాడు. ఎందుకు? ఏ ఫలితాన్ని ఆశించి చేస్తున్నాడు అనేది ఎప్పటికీ శేషప్రశ్నే.

పాతికేళ్ళ యువకుడు రక్తసిక్తమైన ఆమె శరీరాన్ని ఒళ్ళో పెట్టుకుని బోరున ఏడుస్తున్నాడు.

ఆమె చావుబ్రతుకుల్లో ఉంది. అతని చేయి గట్టిగా పట్టుకుంది. విడవటం లేదు. "నేను వెళ్ళిపోతున్నాను" శక్తినంత కూడదీసుకుని పలికింది ఆమె.

"నువ్వు లేకుండా బతకలేను. నేనూ వచ్చేస్తాను" దుఃఖం ఆపుకుంటూ చెప్పాడు అతను.

"వద్దు... నువ్వు చావకూడదు. గతజన్మలో ఏదో తప్పు చేశాను. అందుకే ఇలా మధ్యలోనే నిన్నొదిలిపోతున్నాను. నాకోసం నువ్వు చావకూడదు.

ఎందుకో తెలుసా? నా ఆశలేవీ తీరలేదు. మనం పెళ్ళి చేసుకోవాలి. గంపెడు పిల్లల్ని కనాలి. మన సంసారం నందనవనంలా సాగాలి. ఎన్నో కలలు కన్నాను. ఒక్కటి కూడా తీరకుండానే వెళ్ళిపోతున్నాను.

నేను చచ్చినా నీమీద నాకున్న ప్రేమ చావదు. నేను మళ్ళీ పుడతాను. పైవాళ్ళతో పోరాడైనా సరే తిరిగి నీకోసం వస్తాను. మనం పెళ్ళి చేసుకోవాలి. పిల్లల్ని కనాలి. అందుకే... నువ్వు చావకూడదు. నాకోసం బతకాలి. మళ్ళీ పుట్టి నిన్ను పెళ్ళి చేసుకుంటాను... చావనని మాటివ్వు."

చేతిలో చేయివేసి ప్రేయసికి మాటిచ్చాడు అతను.

ఆమె చనిపోయింది.

అతను ఆమెను హత్తుకుని గుండెలు పగిలేలా రోదిస్తున్నాడు. ఆ జంటను చూసి జాలితో కారుమబ్బులు కూడా కరిగి కుండపోతగా వర్షం మొదలైంది.

ప్రకృతికి కొన్ని ధర్మాలు, నియమాలున్నాయి. అవి మారవు. కాలం ముందుకే... మునుముందుకే పరుగు తీస్తూ వుంటుంది. వెనక్కి తిరిగిచూస్తే కనిపించేది చరిత్ర మాత్రమే. చరిత్రలోంచి ఎవరూ పుట్టుకురారు. రాలేరు.

జీవికి పునర్జన్మ ఉందో లేదో తెలీదు.

కాని చరిత్ర కాలానికి ముందునుంచీ మనిషికి పునర్జన్మ మీద ప్రగాఢ నమ్మకాలు ఉన్నాయి.

వీటిని బలపరిచే అనేక సంఘటనల గురించి అప్పుడప్పుడూ వినిపిస్తూ

వుంటాయి. అవి నిజమా... కల్పితమా అంటే జవాబు దొరకదు.

ఎక్కడి నుంచి వచ్చామో... ఎక్కడకు పోతున్నామో... తెలీని మనిషి... ఇక్కడ మాత్రం శాశ్వతంగా ఉండిపోవాలనుకుంటాడు. సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలనుకుంటాడు. ముఖ్యంగా నిరంతర యవ్వనం కోరుకుంటాడు. ఇది అత్యాశే అయినా అసాధ్యం అని తెలిసినా కూడా అందుకోసం ప్రయత్నించిన వాళ్ళు ఎందరో ఉన్నారు. అనేక ప్రయోగాలు... నిరంతర అన్వేషణ, మందులు, మాకులు, మంత్రాలు, తంత్రాలు ఒక్కటేమిటి? చేయని ప్రయత్నమంటూ లేదు.

చివరకు అంతా వృధా... అన్వేషణని చాపచుట్టేసి పైకి వెళ్ళి పోయిన వాళ్ళే అంతా... కాని ఎక్కడో... ఒకానొకప్పుడు... ఒకానొకచోట... భగీరథ ప్రయత్నం చేసిన ఒకానొక జ్ఞానికి ఆ యోగం సిద్ధించిన దాఖలాలున్నాయి.

కాలాన్ని జయించి, వేల సంవత్సరాలు బతికినవాళ్ళు, కాలంతో పనిలేని చిరంజీవులు, వృద్ధాప్యాన్ని జయించిన నిత్యయవ్వనులు ఉన్నారు.

అలాగని వారిని కలుసుకోవటం, ఆ రహస్యాన్ని తెలుసుకోవటం అంత సులువు కాదు.

అనుభవించాల్సిన వయసులో అనుభవించక, సంపాదనే ధ్యేయంగా అపర కుబేరుడైన ఓ మనిషి, నరాల పటుత్వం తగ్గి, ముఖం ముడతలు పడి, కంటిచూపు తగ్గి, వృద్ధాప్యం ఒడ్డున నిలబడిన వేళ, పోగొట్టుకున్న తన యవ్వనాన్ని తిరిగి పొందాలని తాపత్రయపడ్డం, అందుకోసం ప్రయత్నాలు కోసం ప్రయత్నాలు ఆరంభించటం?!! సృష్టి ధర్మానికి విరుద్ధమే... కానీ, ఐహికమైన కోర్కెలు ఊరకే కూచోనివ్వవుగా? కాలగతి అనుల్లంఘనీయం... అయినా మనిషి స్వార్ధం మరుగున పడదుగా....

కొందరి జీవితాలు తెరిచిన పుస్తకాలేతై, కొందరి జీవితాలు ఎన్నటికీ మూసివున్న పుస్తకాలే. ఆ పుస్తకాల్లోని రహస్యాలు ఎవరికీ అర్థం కావు. అలాంటి రహస్యమే ఒకటి ప్రస్తుతం విఘ్నేశ్వరచౌదరిని చుట్టుకొని వుంది. అందుకే ఆయన ఎవరికీ అర్థంకాడు.

* * * * *

"చౌదరిగారు కన్పించటంలేదట"

"ఈ సంగతి విన్నావా? పెద్దాయన ఇంట్లో లేరట."

"అవున్రా! రాత్రి పాలుతాగి పడుకుని నిద్రపోయిన మనిషి తెల్లవారు ఝామున చూస్తే లేడట."

అతి సుందరమైన రాజభవనంలాంటి ఆ ఇంట్లో తెల్లవారేసరికి పనివాళ్ళ మధ్య జరుగుతున్న చర్చ అది. ఆ చర్చకు కారణమైన పెద్దాయన పేరు విఘ్నేశ్వర చౌదరి. ఆయన పెద్ద ఇండస్ట్రియలిస్ట్.

రెండువేల కోట్ల సంపదకు యజమాని.... డెబ్భైఐదు సంవత్సరాల వయసు. చేయెత్తు ఆజానుబాహుడు... నెరసిన గుబురుమీసాలు, ముగ్గు బుట్టలా పండిన ఉంగరాల తలకట్టు... వృద్ధ సింహంలా తిరిగే పెద్దమనిషి ఆయన.

ఆయన బ్రహ్మచారి....

ఆయనకు ఏమైంది? రాత్రికి రాత్రి ఏం జరిగింది? ఉన్నట్టుండి ఎలా మాయమైపోయాడు? చెప్పా పెట్టకుండా ఎటో వెళ్ళిపోయి వుండాలి. ఎక్కడికి వెళ్తాడు? అలా వెళ్ళిపోవాల్సిన ఖర్మ ఆయనకేమిటి?

ఆయనకోసం పనివాళ్ళు కంగారుపడుతున్నారు.

సిటీలోనే అతి ఖరీదైన జూబ్లీహిల్స్ ప్రాంతం అది...

ఎకరం స్థలంలో చుట్టూ కోటగోడలాంటి ఎత్తయిన ప్రహరీ. మధ్యలో ఐదువేల చదరపు గజాల విస్తీర్ణంలో పదహారు పడగ్గదులు.

ఎనిమిది గెస్ట్‌రూంలతో ఫైవ్‌స్టార్ హోటల్‌ని తలపించే మూడంతస్తుల రోమన్ స్టయిల్ సువిశాల కట్టడం.

కట్టడం చుట్టూ అందమైన గార్డెన్... ఫలవృక్షాలు, పచ్చిక తివాసీలా లాన్... కాంపౌండ్ వాల్ వెంట బాట... ఎప్పుడూ అందుబాటులో ఉండే పదిహేనుమంది నౌకర్లు. అవుట్‌హౌస్‌లో ఐదుగురు నమ్మకమైన నౌకర్లు అనుక్షణం అప్రమత్తంగా సిద్ధంగా ఉంటారు.

గేటుముందు ఇరవైనాలుగు గంటలూ సెక్యూరిటీ ఉంటుంది. కాంపౌండ్‌లో డజను ఖరీదైన కార్లు. అరడజను బైక్‌లు, రెండు జీపులు ఉంటాయి.

ఆ ఇంటికి నలుగురు డ్రైవర్లున్నారు.

ఆయన తల్లి పేరు పరిపూర్ణమ్మగారు. ఆవిడ వయసు సుమారు తొంభై మూడు సంవత్సరాలు. ఇప్పటికీ పళ్ళూడలేదు. చూపు మందగించలేదు.

పరిపూర్ణ ఆరోగ్యంతో ఉందావిడ. మెట్లు ఎక్కలేదు కాబట్టి దిగువ గదిలోనే ఉంటుంది.

గది అంటే ఏదో సింగిల్ గది కాదు. ఆ భవంతిలో ప్రతి గది ఒక

సూట్‌లాగే ఉంటుంది. లివింగ్ రూమ్, డ్రాయింగ్ రూమ్, అటాచ్డ్ బాత్‌రూమ్‌తో విశాలమైన బెడ్‌రూమ్‌లో టీవీ, ఫ్రిజ్, ఎ.సి. అన్ని వసతులు ఉంటాయి. ఆ పక్క గదిలోనే విఘ్నేశ్వర చౌదరి ఉండేది.

పరిపూర్ణమ్మగారికి నలుగురు సంతానం. వాళ్ళలో పెద్దవాడు విఘ్నేశ్వర చౌదరి. అతని తర్వాత రామనాథచౌదరి.

అతని తర్వాత నీలాంబరి, శాకంబరి అని ఇద్దరు కూతుర్లు.

విఘ్నేశ్వర చౌదరి పెళ్ళి చేసుకోలేదుగాని, మిగిలిన అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. అల్లుళ్ళు ఇల్లరికం వచ్చేయటంతో అంతా ఇక్కడే ఉంటారు. రామనాథచౌదరి వయసు డెభ్భై... నీలాంబరి వయసు అరవై ఐదు.... శాకంబరి వయసు అరవై. అంతా నాలుగైదేళ్ళు గ్యాప్‌లో పుట్టినవాళ్ళు.

పరిపూర్ణమ్మగారికి మనవలు, మనవరాళ్ళు అంతా కలిసి పదిమంది ఉన్నారు. వాళ్ళలో నలుగురికి పెళ్ళిళ్ళయి, వాళ్ళకి పిల్లలున్నారు. అంత పెద్ద కుటుంబం అది. పరిపూర్ణమ్మగారి భర్త అప్పట్లో చిన్న వ్యాపారం చేస్తూ కొంత ఆస్తి కూడబెట్టాడు.

ఆయన పోయాక ఇంటికి పెద్ద కొడుకుగా బాధ్యతలు భుజాన వేసుకున్న విఘ్నేశ్వరచౌదరి రేయింబవళ్ళు కష్టపడి ఈ స్థితికి వచ్చాడు. అందుకే ఆయనంటే అందరికీ భయం. ఎక్కువ మాట్లాడరాయన. నిర్ణయాలు చాలా ఖచ్చితంగా ఉంటాయి. చూపులతోనే స్కాన్‌చేసి ఎదుటివారిని అంచనా వేయటంలో దిట్ట, ఎవరినీ లెక్కచేయని స్వభావం.

డెబ్భయ్యోపడిలో పడినా కూడా ఆయనకు ఏ విధమైన ఆరోగ్య సమస్యలు లేవు. ఉదయం సరిగ్గా ఐదుగంటలకు నౌకరు బెడ్ కాఫీ ఇవ్వటంతో ఆయన దినచర్య ఆరంభమవుతుంది.

కాఫీ తాగి బయటికొస్తాడు. ఉదయపు ప్రశాంతమైన వాతావరణంలో స్వచ్ఛమైన గాలి పీలుస్తూ ఆవరణలోని బాటవెంట రౌండ్లు కొట్టడం ఆరంభిస్తాడు.

ఒక్క గంట వాకింగ్ చేసేసరికి ఆరవుతుంది. అప్పుడు లోపలకొచ్చి మరో గంట యోగా చేస్తాడు. ఇవి రెండూ తన ఆరోగ్య రహస్యాలని సగర్వంగా చెప్తూంటాడాయన. ఆ తర్వాత స్నానం చేసి పూజలో కూర్చుంటే పూజ గదిలోంచి బయటకొచ్చేసరికి తొమ్మిదవుతుంది సమయం. బ్రేక్‌ఫాస్ట్ తీసుకుని పదిగంటలకి ఆఫీస్‌కి బయలుదేరుతాడు. ఈ కార్యక్రమంలో సాధారణంగా మార్పనేది ఉండదు. మనసుని ఎప్పుడూ ప్రశాంతంగా ఉంచుకుంటాడు.

ఆవేశకావేషాలను దరికి రానీయడు. అందుకే ఇంతవరకు బీపీ, షుగరు

అంటే ఏమిటో అర్థం ఆయనకు తెలీదు.

అలాంటి విఘ్నేశ్వరచౌదరిగారు ఇలా ఉన్నట్టుండి అదృశ్యం కావటం నౌకర్లలో కొందరికి ఆశ్చర్యం కావచ్చుగాని ఇది ఆ కుటుంబ సభ్యులకు అలవాటే.

ఒక్కోసారి ఎక్కడికి వెళ్ళిందీ, ఏం చేసిందీ కూడా ఎవరికీ తెలీదు.

ఉదయం ఏడుగంటలకే తల్లి పరిపూర్ణమ్మగారికి మొదటి రిపోర్టు వచ్చేసింది. తెల్లవారుఝామున నాలుగు గంటలకి ఆయన ఒక ఎయిర్‌బేగ్ భుజాన వేసుకుని కాలినడకన గేట్లోకి వెళ్ళాట్ట.

అక్కడ సెక్యూరిటీ డ్యూటీలో వున్న గార్డ్సు ఇద్దరూ ఆయన్ను చూసి కంగారు పడ్డారు. వాళ్ళలో ఒకడ్ని పంపి టాక్సీ పిలిపించుకుని వెళ్ళిపోయాట్ట.

ఎక్కడికో తెలీదు. ఆయన చెప్పలేదు. అడిగేంత ధైర్యం గార్డ్సుకి లేదు.

గార్డ్సు నుంచి సమాచారం సేకరించి హౌస్‌కీపర్ వచ్చి చెప్పగానే పరిపూర్ణమ్మగారు– 'భగవంతుడా! వాడు త్వరగా తిరిగి వచ్చేట్టు చూడు స్వామీ' అంటూ మనసులోనే తమ కులదైవాన్ని వేడుకుంది.

ఆ తర్వాత సరిగ్గా తొమ్మిదిగంటలకి– ఆవిడకు రెండో రిపోర్టు వచ్చింది. ఆ సమాచారాన్ని తెచ్చింది చిన్నల్లుడు, శాకంబరి భర్త అయిన శాంతకుమార్. అతను ఎయిర్‌పోర్టుకెళ్ళి విచారించి వచ్చాడు.

"ఏమైంది?" ఆతృతగా అడిగింది.

"బావగారు ఎనిమిదిగంటల ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్ళారు. బోర్డింగ్ లిస్టులో ఆయన పేరుంది" చెప్పాడు శాంతకుమార్.

"ఢిల్లీ వెళ్ళాడా!" విస్తుపోయిందావిడ. ఆ వెంటనే తేరుకుంటూ సాలోచనగా చూసింది. "ఇంట్లోంచి నాలుగుగంటలకే వెళ్ళిపోయాడు. ఫ్లైట్ ఎనిమిది గంటలకి. మధ్యలో నాలుగు గంటలు ఎక్కడికెళ్ళినట్టు, ఏం చేసినట్టు?" గొణుక్కుంటున్నట్లుగా అందావిడ.

"అదే అర్థంగావడం లేదండీ. ఫ్లైట్ టైమ్‌కి ఇరవై నిముషాల ముందు ఎయిర్‌పోర్ట్‌కి వచ్చారట."

"గతంలో వెళ్ళిందానికి, ఈసారి వెళ్ళిందానికి తేడా ఉంది. ఎప్పుడు వెళ్ళినా మన కార్లోనే వెళ్ళి, ఎక్కడో దిగిపోయి డ్రైవర్ని వెనక్కి పంపించేవాడు.

కానీ, ఈసారి కాలినడకన కాంపౌండ్ దాటి టాక్సీలో వెళ్ళాడు. అందుకే కొంచెం కంగారుగా ఉందయ్యా.... ఫోన్ చెయ్యి... వెంటనే మన ఢిల్లీ బ్రాంచ్ మేనేజరుకి ఫోన్ చేసి చౌదరి వస్తున్నట్లు చెప్పి ఏర్పాట్లు చూడమనండి. ఎయిర్‌పోర్ట్‌కెళ్ళి రిసీవ్ చేసుకోమని చెప్పాలి" హడావుడిగా సూచనలిచ్చారు పరిపూర్ణమ్మ

గారు.

"మీరు వర్రీ కావద్దు అత్తయ్యగారూ! ఇప్పుడే ఫోన్‌చేసి మేనేజర్‌తో మాట్లాడతాను" అంటూ తన సెల్ అందుకున్నాడు చిన్నల్లుడు శాంతకుమార్.

"ఏమిటో! ఈ పెద్దాడితో ఎప్పుడూ నాకు తలనొప్పే. పనిలో పనిగా రాముడు ఎక్కడున్నాడో ఫోన్‌చేసి అర్జంటుగా నావద్దకు రమ్మని చెప్పండి" అని చెప్పి లోపలికెళ్ళి పోయింది పరిపూర్ణమ్మ.

రాముడు అంటే రామనాథచౌదరి.

ఆవిడ చిన్నకొడుకు. అత్తగారి ఆర్డర్‌ని శిరసావహిస్తూ అప్పటికప్పుడు తన సెల్ నుంచి ఢిల్లీ బ్రాంచ్ మేనేజరుకి కాల్ చేశాడు చిన్నల్లుడు శాంతకుమార్.

* * * * *

భూమికి ముప్పైవేల అడుగుల ఎత్తున ఢిల్లీ దిశగా దూసుకుపోతోంది ఎయిర్ బస్.

ప్రయాణీకులు కొందరు నిద్రమత్తులో జోగుతున్నారు. కొందరు చిన్నగా కబుర్లు చెప్పుకుంటున్నారు. విండో పక్కన కూర్చుని ఉన్నాడు విఘ్నేశ్వర చౌదరి.

అర్ధనిమీలిత నేత్రాలతో ఆయన దీర్ఘాలోచనలో ఉన్నాడు. సుదీర్ఘమైన తపోనిష్ఠలో ఉన్నట్టున్నాడు. మనసంతా గజిబిజిగా ఉంది. తెల్లవారుఝామునే లేచిన అలసట ఆయన ముఖంలో కనబడుతోంది.

ఆయన ఆలోచనలు నాలుగు గంటలు వెనక్కి మళ్ళాయి. నాలుగు గంటలకే రెడీ అయి ఇంట్లోంచి బయటికొచ్చాడు. టాక్సీలో బయలుదేరాడు. అరగంట ప్రయాణం.

ఒక రెస్టారెంటు ముందు టాక్సీ దిగి పంపించేశాడు. రెస్టారెంట్‌లో కూర్చుని టీ ఆర్డర్ చేశాడు. తీరిగ్గా టీ తాగి బయటికొచ్చేసరికి సమయం ఐదుగంటలైంది. వీధిలో పేపరు కుర్రాళ్ళు, పాలవాళ్ళ సందడి మొదలైంది. ఉదయపు శీతగాలులు చలిచలిగా ఆహ్లాదభరితంగా ఉన్నాయి. మరో టాక్సీ ఎక్కాడు. ఆ సమయంలో విఘ్నేశ్వరచౌదరి వంటి కోటీశ్వరుడు ఒక సాధారణ పౌరుడిలా టాక్సీలో ప్రయాణం చేస్తున్నాడంటే ఎవరూ నమ్మరు.

మళ్ళీ అరగంట ప్రయాణం.

బొల్లారం దాటగానే ఒక కాలనీలో ప్రవేశించింది టాక్సీ. కాలనీ అంతా ఇంకా నిద్రమత్తులోనే ఉంది. ఒక వీధి మొదట్లోనే టాక్సీ ఆపించాడు.

"వెయిట్ చేయగలవా?" టాక్సీ దిగుతూ అడిగాడు.

"జీ సాబ్. మీరు వెళ్ళిరండి. వెయిట్ చేస్తాను" అన్నాడు డ్రైవరు. తన ఎయిర్ బ్యాగ్‌ని టాక్సీలోనే వదిలి కాలినడకన ముందుకు కదిలాడాయన. మలుపు తిరగ్గానే గీత గీసినట్టు స్ట్రెయిట్‌గా ఉందా వీధి. వీధిలైట్లు వెలుగుతున్నాయి. వీధిలో పొగమంచు చుట్టుకుంటోంది. శాలువా భుజాల మీదుగా కప్పుకుని ముందుకు సాగాడు.

కొంతదూరం వెళ్ళి కుడిపక్కన చీకటిగా ఉన్న ఓ ఇంటి అరుగుమీద కూర్చున్నాడు. పరిశీలనగా చూస్తే తప్ప అక్కడ చీకట్లో మనిషి కూర్చున్నట్లు తెలీదు.

అక్కడికి కాస్త ఎడంగా రోడ్ అవతల పచ్చడాబా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రశాంతంగా ఉంది అంతటా... డాబాలో ఇంకా లైట్లు వెలగలేదు. ఆయన కళ్ళ ముందు ఒక అందమైన యువతిరూపం మెదలుతోంది. ఇరవై వసంతాల యవ్వని, అపురూప సౌందర్యరాశి.

రుద్రాక్షలో దశముఖి, అష్టముఖి, షణ్ముఖి, చతుర్ముఖి అంటూ అనేక ముఖాల రుద్రాక్షలున్నాయి. కాని, ఆమె తనకు లభించిన అపురూపమైన ఏకముఖి రుద్రాక్ష.

రుద్రాక్ష....

ఆమె తన ప్రాణం. తన సర్వస్వం.

ఆ... పేరే తననింకా బతికించింది. ఇంకా బతికిస్తూనే వుంటుంది. ఈ ఊపిరి ఆమెకోసమే ఆగింది.

ఆలోచిస్తుండగానే ఆ డాబా ఇంట్లో లైట్లు వెలిగాయి. విఘ్నేశ్వరచౌదరి అప్రమత్తమయ్యాడు.

తనకు తెలుసు. ఆమె బయటికొస్తుంది.

రెండు నిముషాల తర్వాత వరండా లైటు కూడా వెలిగింది. తలుపు తెరుచుకుని ఆమె బయటికొచ్చింది. ఒకచేతిలో నీళ్ళబకెట్... ఒక చేతిలో చీపురు.

ఉదయభానుణ్ణి ఆహ్వానించడానికి స్వాగత తోరణాలు కట్టవచ్చిన వెన్నెల బాలలా ఉందామె. అప్పటికీ ఇప్పటికీ ఆమెలో కొంచెం కూడా మార్పు లేదు. అదే నడక... అదే అందం... అవే కదలికలు... అవే అలవాట్లు.

బద్ధకం అనే మాటకు అర్థం తెలీని రుద్రాక్ష... తన్మయంగా ఆమెనే చూస్తున్నాడు విఘ్నేశ్వర చౌదరి. బయలుదేరింది దూరప్రయాణం. మళ్ళీ ఎన్ని రోజులకు వస్తాడో ఏమిటో! అందుకే తనివి తీరా ఆమెను అలా చూస్తూ

కూర్చున్నాడు. ఆమె వాకిలి ఊడ్చి నీళ్ళు చిమ్ముతూ ఉన్నట్టుండి ఆగిపోయింది.

గబగబా చేతులు కడుక్కుని వీధిలోకొచ్చి అటూ ఇటూ చూసింది. అది గమనించి మరింత ఒదిగి కూర్చున్నాడు విఘ్నేశ్వరచౌదరి. రెండుసార్లు ఆమె వీధిలోకి వెనక్కి తిరిగిచూసింది. మళ్ళీ వీధిలోకి వచ్చింది. ఆమె ఆత్మఘోష అతనికి వినబడుతోంది. "విఘ్నా... ఎక్కడున్నావ్?" ఆమె మనసులోని ఆవేదన వింటున్నాడు.

"నాకు తెలుసు. నువ్విక్కడే ఎక్కడో ఉన్నావ్. ఏ చూపులు నన్ను తాకుతున్నాయి. బదులివ్వు... ఎక్కడున్నావ్?" ఆమె ప్రశ్నల్లో ఆవేదన ఉంది. అంతులేని ఆరాటం ఉంది. అప్పటికీ మౌనం వహించాడాయన.

"ఇది న్యాయం కాదు. ఒక్కసారి నిన్ను చూడాలి. నా ముందుకు రా ప్లీజ్..." ఆమె కళ్ళు చెమర్చాయి.

ఆమె మనసులోని మాటలు దుఃఖభాజితంగా ఉన్నాయి. వెదుకులాడుతోందామె.

'ఇప్పుడు కూడా నన్ను చూడలేవు' మనసులోనే బదులిచ్చాడు విఘ్నేశ్వర చౌదరి.

'ఎందుకు? ఇంకా ఎన్నాళ్ళు? ఎక్కడున్నావ్?' వెంటనే ప్రతిధ్వనించింది ఆమె హృదయం. "అందుకు ఇంకా సమయం ఉంది. ముఖ్యమైన పనిమీద చాలా దూరం వెళ్తున్నాను. తిరిగిరావటం ఆలస్యం కావచ్చు."

"వద్దు... వెళ్ళొద్దు. నేను నిన్ను చూడాలి."

"అందుకు సమయం రాలేదు."

"ఎప్పుడొస్తుంది?" అది కూడా చెప్పలేను" రెండు హృదయాల స్పందన అది.

మూగమనసుల సంభాషణ. ఒకరి మనసులో మాట ఒకరు స్పష్టంగా వినగలుగుతున్నారు. అంతలో వారి సంభాషణకు అంతరాయం కలిగింది.

"ఏయ్ మాయా... ఏమిటే దిక్కులు చూస్తున్నావ్. పనిమాని ఎవరికోసం వెదుకుతున్నావ్?" అప్పుడే బయటకు వచ్చిన తల్లి పిలుపుతో ఆమె మాటలు ఆగిపోయాయి.

"మమ్మీ... ఆయన వచ్చారు. ఇక్కడే ఎక్కడో ఉన్నారు" అంది తల్లితో మాయ.

"ఎవరు వచ్చారు?" అనుమానంగా ప్రశ్నించిందావిడ.

"విఘ్నేశ్వరుడు...!"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2485**

* * *

**Read other novels of Suryadevara Rammohana Rao @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Suryadevara+Rammohana+Rao&id=409**